
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం । 30 । మే । 2024



అశ్వవాహనంపై నృసింహుడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా పెన్నహోబిళం లక్ష్మీ నరసింహ స్వామి బుధవారం అశ్వవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శన మిచ్చారు. 8లో



మానవాకార.. ముక్కంటీశ్వరా

ఎక్కడైనా పరమేశ్వరుడు లింగాకారంలో దర్శనమిస్తాడు. కానీ హేమావతిలో మాత్రం మానవకారునిగా కనిపిస్తాడు. శిల్పకళకు నిలయంగా ఈక్షేత్రం విరాజిల్లుతోంది. 8లో

గరిష్టం/కనిష్టం
38.6°/22.5°

జిల్లావ్యాప్తంగా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలి వేగం పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృత మైంది. గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- భోజన ఏజెన్సీ నిర్వాహకులకు డీఈఓ మీనాక్షి ఆదేశం



మధ్యాహ్న భోజన నిర్వాహకులనుద్దేశించి మాట్లాడుతున్న డీఈఓ మీనాక్షి

చిలమత్తూరు: 'జగనన్న గోరుముద్ద' పథకం కింద పాఠశాల విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని, ఇందులో రాజీపడే ప్రసక్తే లేదని డీఈఓ మీనాక్షి అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు నిర్వహించిన ఒక్క రోజు శిక్షణ తరగతులను డీఈఓ పరిశీలించారు. ఈ సందర్భంగా పోషకాలతో కూడిన ఆహారాన్ని ఎలా తయారు చేయాలి అనే అంశాన్ని వివరించారు. అనంతరం మాట్లాడుతూ, పాఠశాలల పునః ప్రారంభం రోజు నుంచే మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. రుచి, శుచికరమైన భోజనం వడ్డించాలన్నారు. నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-1 పద్మప్రియ, ఎంఈఓ-2 సాల్మన్‌రాజ్, ఉపాధ్యాయులు అలీముల్లా, ఎమ్మార్సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏపీ ఈసెట్, ఐసెట్ ఫలితాల విడుదల



అనంతపురం: ఏపీ ఈసెట్ -2024 పరీక్ష ఫలితాలు గురువారం ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నారు. జేఎన్‌టీయూ అనంతపురంలో నిర్వహించే ఫలితాల విడుదల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె. హేమచంద్రారెడ్డి హాజరు కానున్నారు. ఈ మేరకు ఏపీ ఈసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ పీఆర్ భానుమూర్తి తెలిపారు.

- శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఏపీ ఐసెట్-2024 ఫలితాలు గురువారం సాయంత్రం 4 గంటలకు విడుదల చేయనున్నారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఫలితాలను విడుదల చేస్తారు. ఈ మేరకు ఏపీ ఐసెట్ చైర్మన్ ప్రొఫెసర్ కే.హుస్సేన్‌రెడ్డి పేర్కొన్నారు.

ఎలుగుబంటి కలకలం



చెట్టుపై ఉన్న ఎలుగుబంటి

బొమ్మనహాళ్: మండలంలోని ఉంతకల్లు గ్రామంలో బుధవారం ఓ ఎలుగుబంటి కలకలం రేపింది. తెల్లవారుజామున గ్రామంలోకి వస్తున్న ఎలుగుబంటిని కుక్కలు తరమడంతో సమీపంలోని చెట్టు ఎక్కింది. గమనించిన స్థానికులు బొమ్మనహాళ్ ఎస్‌ఐ శ్రీనివాసులు, రాయదుర్గం అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ క్రమంలోనే ప్రజలు ఎక్కువ సంఖ్యలో ఆ ప్రాంతంలో గుమిగూడంతో ఎలుగుబంటి భయపడి చెట్టుపైనే కూర్చుంది. కొంత సేపటికి అక్కడికి చేరుకున్న అధికారులు.. జేసీబీని తెప్పించి ఎలుగుబంటి ఉన్న చెట్టును అదిలించగా, కిందపడిన భల్లూకం పరిగెత్తి వెళ్లి మరో చెట్టుపైకి ఎక్కింది. కొంత సేపటికే కిందికి దిగి గ్రామ శివారులో ఉన్న కొండలోకి పరుగు తీసింది. కొద్ది రోజులుగా ఉంతకల్లు సమీపంలో ఎలుగుబంట్ల సంచారం పెరగడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. అటవీశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకుని ఎలుగుబంట్లను అడవిలో వదిలిపెట్టాలని వారు కోరుతున్నారు.



భయంతో పరుగుతీస్తున్న భల్లూకం

తల్లీబిడ్డకు రక్ష

- పేదలకు వరంలా 108, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు
- ప్రసవం కోసం 108లో ఆస్పత్రులకు తరలింపు
- ప్రసవానంతరం తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా ఇంటికి చేరుస్తున్న వైనం
- మాతా శిశు మరణాల తగ్గింపుపై ప్రభుత్వ ప్రత్యేక దృష్టి



ఇక్కడున్న బాలింత పేరు అనిత. పరిగి మండలంలోని గొల్లపల్లి స్వగ్రామం. ఈ నెల 14వ తేదీన అనితకు పురిటి నొప్పులు వస్తుండడంతో కాన్పు కోసం పరిగి నుంచి హిందూపురం జిల్లా ప్రభుత్వాస్పత్రికి 108 వాహనంలో వచ్చారు. వైద్యులు సాధారణ ప్రసవం చేశారు. వైద్య చికిత్స అనంతరం తల్లీబిడ్డ క్షేమంగా ఉండటంతో మందులు అందజేసి ఈ నెల 16న డిశ్చార్జ్ చేశారు. డాక్టర్ వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనం ద్వారా తల్లీబిడ్డను సురక్షితంగా గొల్లపల్లిలోని వారి ఇంటికి చేర్చారు.



ఆస్పత్రిలో ప్రసవానంతరం తల్లీ బిడ్డను డాక్టర్ వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనంలో వారి ఇంటి వద్దకు చేర్చడానికి తీసుకువెళ్తున్న దృశ్యం

రోజూ ఎంతో మంది గర్భిణులు, బాలింతలకు 108, డాక్టర్ వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు సేవలందిస్తున్నాయి. దీంతో గర్భిణులు, బాలింతలు జగన్ సర్కార్ చర్యలను కొనియాడుతున్నారు. పైసా ఖర్చు లేకుండా ఆస్పత్రికి తీసుకువెళ్లి పురుడు పోయడంతో పాటు క్షేమంగా ఇంటికి తీసుకువచ్చే వ్యవస్థ ఏర్పాటు చేసిన సీఎం జగన్‌కు ప్రజలంతా కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



పైచిత్రంలోని బాలింత పేరు నీలావతి. వీరిది హిందూపురంలోని ముద్దిరెడ్డిపల్లి. ఈ నెల 14న నీలావతికి పురిటి నొప్పులు రావడంతో కుటుంబీకులు 108కు సమాచారం అందించారు. దీంతో వెంటనే 108 సిబ్బంది నీలావతి ఇంటికి వెళ్లి ఆమెను హిందూపురం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తీసుకువచ్చారు. ఆస్పత్రిలో వైద్యులు సుఖ ప్రసవం చేసి, వైద్య సేవల అనంతరం మందులను అందజేసి ఈ నెల 16న డిశ్చార్జ్ చేశారు. అంతే కాకుండా తల్లీబిడ్డను డాక్టర్ వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనంలో సురక్షితంగా వారి ఇంటికి చేర్చారు.

హిందూపురం టౌన్: గతంలో గ్రామీణ ప్రాంతాల్లోని మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి కుటుంబీకులు తీవ్ర ఆందోళన చెందేవారు. ఎప్పుడు ఏ వైద్యసాయం కావాలన్నా ప్రైవేటు వాహనాల ద్వారా ఆస్పత్రులకు వెళ్లాల్సి వచ్చేది. ఒక్కో సమయంలో ప్రైవేటు వాహనం అందుబాటులో లేకపోతే వారి బాధలు అన్నీఇన్నీ కావు. కానీ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పరిస్థితి పూర్తిగా మారింది. తల్లీబిడ్డల సంక్షేమం కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి చికిత్సలు మొదలు.. ప్రసవం చేయడం..ఆ తర్వాత కూడా తల్లీబిడ్డను సురక్షితంగా ఇంటికి చేర్చేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ప్రభుత్వాస్పత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు గర్భిణులకు, ప్రసవానంతరం తల్లీబిడ్డకు ప్రభుత్వం శ్రీరామరక్షగా నిలుస్తోంది.

అందుబాటులోకి అత్యాధునిక వాహనాలు..

నెలలు నిండిన గర్భిణులను కాన్పుకోసం ఇంటి నుంచి 108 వాహనాల ద్వారా ప్రభుత్వాస్పత్రులకు చేరుస్తున్నారు. ప్రసవానంతరం తల్లీబిడ్డను డాక్టర్ వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల ద్వారా సురక్షితంగా ఇంటి వద్దకు చేరుస్తున్నారు. ఇందు కోసం జగన్ సర్కార్ అత్యాధునిక వాహనాలను అందుబాటులోకి తెచ్చింది. పూర్తి ఎయిర్ కండిషన్డ్ వసతులతో, జీపీఎస్ నెట్‌వర్క్ అనుసంధానంతో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ వాహనంలో తల్లీబిడ్డతో పాటు వారితో ఉన్న సహాయకులు సౌకర్యవంతంగా కూర్చుని ప్రయాణించేలా వాహనాలను డిజైన్ చేసింది. గతంలో ప్రసవానంతరం తల్లీబిడ్డను ఇంటికి చేర్చేందుకు కుటుంబీకులు వేలాది రూపాయలు వెచ్చించి ప్రైవేటు వాహనాలను ఆశ్రయించేవారు. అలాంటి ఇబ్బందులు లేకుండా ప్రసవానంతరం తల్లీబిడ్డను డాక్టర్ వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల ద్వారా క్షేమంగా ఇంటికి చేరుస్తున్నారు. సుదూర ప్రాంతాలకైనా ఎలాంటి ఇబ్బందులు లేకుండా తీసుకువెళ్తున్నారు.

ఉమ్మడి జిల్లాకు 36 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు..

తల్లీబిడ్డల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం ఆస్పత్రుల నుంచి బాలింతలు, శిశువులను క్షేమంగా ఇళ్లకు చేర్చేందుకు భారీగా నిధులు వెచ్చిస్తోంది. ఈ క్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు 24 వాహనాలు సమకూర్చింది. ఇందులో అనంతపురం జీజీహెచ్‌కు 13, తాడిపత్రికి రెండు, శింగనమల, పెద్దవడుగూరు, గుత్తి, గుంతకల్లు, ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం, బ్రహ్మసముద్రం, బొమ్మనహాళ్ ఆస్పత్రులకు ఒకటి చొప్పున కేటాయించింది. అలాగే శ్రీ సత్యసాయి జిల్లా 12 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు కేటాయించింది. అందులో హిందూపురం జిల్లా ప్రభుత్వాస్పత్రికి మూడు, కదిరి ఆస్పత్రికి రెండు, నల్లచెరువు, ముదిగుబ్బ, గోరంట్ల, ధర్మవరం, పెనుకొండ, రొళ్ల, మడకశిరకు ఒకటి చొప్పున కేటాయించింది.

రోజూ సగటున 50 మందికి సేవలు..

డాక్టర్ వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు రోజుకు సగటున 50 మందికి సేవలందిస్తున్నాయి. శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో 2023 ఏప్రిల్ నుంచి 2024 ఏప్రిల్ వరకు 5,200 మంది తల్లీబిడ్డ సేవల ద్వారా ప్రభుత్వ ఆస్పత్రుల నుంచి సురక్షితంగా ఇళ్లకు చేరారు. అలాగే హెచ్ఆర్‌పీడబ్ల్యూ, ఎస్ఏపీడబ్ల్యూ కేసులు 1,850 కేసులను తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లలోనే తరలించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో నెలకు 2 వేల మంది దాకా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహన సేవల ద్వారా ప్రయోజనం పొందుతున్నారు.

ఆపద్బాంధవి 108..

ఇక 108 అంబులెన్సులు కూడా బాలింతలకు ఆపద్బాంధవిలా మారాయి. అత్యాధునిక సౌకర్యాలతో కూడిన 108 అంబులెన్సులు అనంతపురం జిల్లాలో 33, శ్రీ సత్యసాయి జిల్లాలో 33 వాహనాలు సేవలందిస్తున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2022 సంవత్సరంలో 26,281 మంది గర్భిణులను 108 వాహనాల ద్వారా ఆస్పత్రులకు తరలించారు. అలాగే 2023లో 24,195 మంది గర్భిణులను ఆస్పత్రులకు తరలించారు. అలాగే 2024 మార్చి వరకు 5,049 మంది గర్భిణులను 108 వాహనాల్లో ఆస్పత్రులకు చేర్చారు.

సమాచారం అందగానే స్పందిస్తున్నాం



మాతా శిశు మరణాలను తగ్గించడం కోసం ప్రభుత్వం 108, డాక్టర్ వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మండలానికి ఒకటి చొప్పున 108 వాహనాలు అందుబాటులో ఉన్నాయి. 108 సమాచారం అందిన వెంటనే వేగంగా స్పందించి సేవలందిస్తున్నాం. ముఖ్యంగా మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి సేవలందిస్తున్నాం. అర్ధరాత్రి వేళ పురిటి నొప్పులు వచ్చినా వేగంగా స్పందిస్తూ సకాలంలో ఆస్పత్రులకు చేరుస్తున్నాం. పురిటి పిల్లల ఆరోగ్య సంరక్షణ కోసం జిల్లాకు ఒకటి చొప్పున నియోనటాల్ అంబులెన్స్ అందుబాటులో ఉంచాం. – సంజీవరెడ్డి,
108 అంబులెన్స్, జిల్లా మేనేజర్

కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ అరుణ్‌బాబు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి అర్బన్: ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్‌బాబు ఈసీఐ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్‌వ్యాస్‌కు తెలిపారు. కౌంటింగ్ సన్నద్ధతపై డీఈసీ బుధవారం న్యూఢిల్లీలోని నిర్వచన్ సదన్ నుంచి జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటిస్తూ ఓట్ల లెక్కింపు ప్రక్రియ, కచ్చితమైన ఫలితాల ప్రకటన, శాంతిభద్రతల పరిరక్షణకు నియోజకవర్గాల వారీగా చేపట్టిన ఏర్పాట్లు, తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు ఎస్పీ మాధవరెడ్డి, జేసీ అభిషేక్ కుమార్, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, డీఆర్ఓ కొండయ్య, రిటర్నింగ్ అధికారులు భాగ్యరేఖ, సన్నీ వంశీకృష్ణ, వెంకటశివ కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జూన్ 4న చేపట్టనున్న ఓట్ల లెక్కింపు కోసం సిబ్బంది నియామకం పూర్తయ్యిందని, వారికి శిక్షణ కూడా ఇచ్చామన్నారు. పోస్టల్ బ్యాలెట్, ఈవీఎం, ఈటీపీబీఎస్ ఓట్ల లెక్కింపుకు అనుగుణంగా చర్యలు తీసుకున్నామన్నారు. ఓట్ల లెక్కింపునకు పార్లమెంట్ పరిధిలో 98 టేబుళ్లు, 137 రౌండ్లు, 7 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 98 టేబుళ్లు, 137 రౌండ్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. జిల్లాలోని రెండు కేంద్రాల్లో కౌంటింగ్ ఏర్పాట్లు చేశామన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద 140 సీసీ కెమెరాలు, 7 సోలార్ సీసీ కెమెరాల ద్వారా నిఘా ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షిస్తున్నామన్నారు.

పటిష్టమైన భద్రత కల్పించాం..

కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు ఎస్పీ మాధవరెడ్డి డీఈసీ నితీష్ వ్యాస్‌కు వివరించారు. కౌంటింగ్ కేంద్రాలకు కిలో మీటర్ దూరం వరకూ 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నామన్నారు. ఒక కంపెనీ కేంద్ర ఆర్మ్‌డ్ బలగాలు, ఒక ప్లాటూన్ ఏఎస్పీ బలగాలు, ఇద్దరు అదనపు ఎస్పీలు, 9 మంది డీఎస్పీలు, 13 మంది సీఐలు, 64 మంది సివిల్, రిజర్వ్ ఎస్ఐలు, 97 మంది ఏఆర్ ఎస్ఐలు, 326 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 128 మంది కానిస్టేబుళ్లు, 242 మంది హోం గార్డులను కౌంటింగ్ విధులకు నియమించామన్నారు. జిల్లాలో 101 గ్రామాలను సెన్సిటివ్‌గా గుర్తించి తగు చర్యలు తీసుకున్నామని వివరించారు. అనంతరం ఆయా అసెంబ్లీ నియోజక వర్గాల సమాచారాన్ని ఆర్ఓలు వివరించారు.

నంబర్ ప్లేట్లపై నజర్!



నంబర్ ప్లేట్ సరిగా లేని వాహనం ఫొటో తీస్తున్న ట్రాఫిక్ పోలీసు (ఫైల్)

- వాహనం నంబర్ ప్లేట్లు మార్చిన వారిపై దృష్టి
- జిల్లా వ్యాప్తంగా ముమ్మర తనిఖీలు
- నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలు
- విరుద్ధంగా ఉన్న నంబర్ ప్లేట్ల తొలగింపు
- కొత్తవి అమర్చకుంటే జరిమానాలు

సాక్షి, పుట్టపర్తి: ట్రాఫిక్ నిబంధనలు పక్కాగా అమలు చేసేందుకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న వారికి జరిమానాలు విధిస్తున్నారు. ముఖ్యంగా నంబర్ ప్లేట్లపై ప్రత్యేక దృష్టి సారించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటిని తొలగించి కొత్తవి వేయిస్తున్నారు.

తప్పించుకునేందుకు కొత్త ఎత్తుగడ..

చాలామంది వాహనదారులు జరిమానాలను తప్పించుకునేందుకు కొత్త ఎత్తుగడ వేస్తున్నారు. నంబర్ సరిగా కనిపించకుండా చేయడం లేదా... నంబర్ ప్లేటే లేకుండా వాహనాలు నడుపుతున్నారు. ఇలాంటి వాహనాల వల్ల నేర పరిశోధనలో ఆటంకం కలిగే అవకాశం ఉండటంతో పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో తనిఖీలు ముమ్మరం చేశారు. నంబర్ ప్లేట్లు సరిగా లేని వాహనాలను గుర్తించి.. జరిమానాలు విధిస్తున్నారు. కొన్ని వాహనాలను పోలీస్ స్టేషన్లకు తరలిస్తున్నారు.

పట్టణాల్లోనే ఎక్కువ

హిందూపురం, కదిరి, ధర్మవరం తదితర పట్టణాల్లోనే నంబరు ప్లేట్లు సరిగా లేకుండా తిరిగే వాహనాలు పట్టుబడ్డాయి. వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో నిబంధనలు తుంగలో తొక్కి.. చాలామంది ఎడాపెడా ప్రయాణాలు చేస్తుంటారు. ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో తనిఖీలు చేసి.. ఐఎన్‌డీ నంబర్ల ప్లేట్లు వాడని వారిపై పోలీసులు జరిమానాలు విధించారు. అంతేకాకుండా మరోసారి పట్టుబడితే వాహనం స్టేషన్‌కు తరలిస్తున్నారు. దీంతో చాలామంది నంబరు ప్లేట్లు సరి చేసుకున్నారు.

సరిహద్దులో కట్టుదిట్టం..

జిల్లాలోని 32 మండలాల్లో.. 16 మండలాలు కర్ణాటక సరిహద్దులో ఉంటాయి. ఫలితంగా సగానికిపైగా వాహనాలు కర్ణాటక రిజిస్ట్రేషన్‌కు సంబంధించినవే. అయితే ఆ వాహనాలకు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు ఉండేలా చూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అన్ని ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేయడంతో నేరాలు కూడా అదుపులోకి వచ్చాయని అధికారులు చెబుతున్నారు. గుర్తు తెలియని వాహనాలపై ఎక్కడికక్కడ చర్యలు తీసుకుంటున్నారు. సీసీ కెమెరాల ఆధారంగా జరిమానాలు విధిస్తున్నారు.

నిబంధనలు పాటించాల్సిందే



మోటారు వాహనాల చట్టం ప్రకారం ప్రతి వాహనానికి నంబర్ ప్లేట్ తప్పనిసరి. అలాగే వాహనం ధ్రువీకరణ పత్రాలు, బండి నడిపే వ్యక్తికి లైసెన్సులు ఉండాలి. చాలా మంది నిబంధనలకు విరుద్ధంగా వాహనానికి నంబర్లు వేసుకుంటున్నారు. దీనివల్ల చాలా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అందువల్లే అలాంటి వాహనాలు రోడ్డుపై కనిపిస్తే సీజ్ చేస్తున్నాం.
– కరుణసాగర్‌రెడ్డి, జిల్లా రవాణా అధికారి

అతిక్రమిస్తే చర్యలే



జిల్లా వ్యాప్తంగా ముమ్మర తనిఖీలు చేపట్టాం. ద్విచక్రవాహనాలు నంబర్ ప్లేట్ లేకుండా తిరిగినా.. భారీ శబ్దాలు చేస్తూ రోడ్డెక్కినా చర్యలు తప్పవు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి వాహనదారుడూ చట్టానికి లోబడి ప్రయాణించాల్సి ఉంటుంది.
– ఎస్వీ మాధవ్‌రెడ్డి, ఎస్పీ

రైతులందరికీ నాణ్యమైన విత్తనం



మహిళా రైతుకు విత్తన వేరుశనగ అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు తదితరులు

- 5.10 లక్షల ఎకరాల్లో వేరుశనగ సాగవుతుందని అంచనా వేశాం
- 90 వేల క్వింటాళ్ల విత్తనానికి ప్రతిపాదనలు పంపాం
- విత్తన వేరుశనగ పంపిణీలో కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: ఖరీఫ్‌లో వేరుశనగ సాగుచేసే రైతులందరికీ నాణ్యమైన విత్తనాలు అందిస్తామని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. బుధవారం ఆయన ఏపీ సీడ్ కార్పొరేషన్ ఎండీ శివప్రసాద్, ఆర్డీఓ భాగ్యరేఖ, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావుతో కలిసి స్థానిక వ్యవసాయ కార్యాలయ గోదాము వద్ద విత్తన వేరుశనగ పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా రైతులు ఖరీఫ్‌లో సుమారు 5.10 లక్షల ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేయనున్నట్లు అంచనా వేశామన్నారు. ఈ మేరకు 90 వేల క్వింటాళ్ల విత్తనానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఇప్పటికే 35 వేల క్వింటాళ్ల విత్తనం జిల్లాకు చేరగా, రైతు భరోసా కేంద్రాల్లో నిల్వ చేశామన్నారు. జిల్లా రైతుల కోసం కే-6, టీసీజీఎస్-1694, కదిరి లేపాక్షి-1812 రకాలు అందుబాటులో ఉంచామన్నారు. అర ఎకరా భూమి ఉన్న రైతులకు 30 కిలోల బస్తా ఒకటి, ఎకరా భూవిస్తీర్ణం ఉన్న రైతులకు రెండు బస్తాలు, ఎకరాకుపైన భూమి ఉన్న రైతులకు మూడు బస్తాల చొప్పున విత్తన వేరుశనగ పంపిణీ చేస్తామన్నారు. ఈసారి వర్షాలు కూడా సాధారణం కంటే అధికంగా కురిసే అవకాశాలున్నాయని, రైతులంతా పంటలు సాగుచేయాలని సూచించారు.

ఈ-క్రాప్ తప్పనిసరిగా చేయించాలి

జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు మాట్లాడుతూ, ఖరీఫ్‌లో పంటలు సాగుచేసే రైతులు విత్తనం వేసిన 20 రోజుల తర్వాత ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ-క్రాప్ నమోదు వల్ల ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పంటలు దెబ్బతింటే ప్రభుత్వం నుంచి పరిహారం అందుతుందన్నారు. ఇప్పటివరకూ నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం అందేలా చూశామన్నారు. ఏపీ సీడ్ కార్పొరేషన్ ఎండీ శివప్రసాద్ మాట్లాడుతూ, ప్రభుత్వం క్వింటా వేరుశనగను రూ.9,500 చొప్పున కొనుగోలు చేసి 40 శాతం సబ్సిడీతో రైతులకు అందిస్తోందన్నారు. అందువల్ల విత్తనం తీసుకున్న వారంతా తప్పకుండా పంట సాగుచేయాలన్నారు.

తొలిరోజు 19,214 క్వింటాళ్ల విత్తనం పంపిణీ

రాయితీ విత్తన వేరుశనగ పంపిణీకి అధికారులు పక్కా ఏర్పాట్లు చేశారు. ఫలితంగా తొలిరోజు బుధవారం 19,214 క్వింటాళ్ల విత్తన కాయలను రైతులకు అందజేశారు. జిల్లాలోని 416 ఆర్‌బీకేల ద్వారా 22,363 మంది రైతులకు విత్తన వేరుశనగ అందించినట్లు జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు తెలిపారు.

విత్తన శుద్ధి కేంద్రాల పరిశీలన..

ధర్మవరం రూరల్: స్థానిక విజేత అగ్రిటెక్, సాయి సీడ్స్ వేరుశనగ విత్తన శుద్ధి కేంద్రాన్ని బుధవారం జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ) వైవీ సుబ్బారావు, ఏపీ సీడ్స్ ఎండీ ఎం.శివప్రసాద్, ఏడీఏ కృష్ణయ్య తదితరులు పరిశీలించారు. విత్తన నాణ్యత ప్రమాణాలను తప్పని సరిగా పాటించాలని విత్తన శుద్ధి కేంద్ర యజమానులకు సూచించారు. వారి వెంట మండల వ్యవసాయాధికారి ముస్తఫా, ప్లాంట్ యజమానులు రమణారెడ్డి, కొండారెడ్డి, ఏఈఓలు ప్రతిభ, అశ్విని, జగదీష్, ఉపేంద్ర తదితరులు ఉన్నారు.

నాణ్యమైన విత్తన కాయలే ఇవ్వాలి..

కదిరి అర్బన్: రైతులకు నాణ్యమైన విత్తన కాయలే ఇవ్వాలని ఏపీ సీడ్స్ ఎండీ శివప్రసాద్ ప్రాసెసింగ్ యూనిట్ నిర్వాహకులకు ఆదేశించారు. బుధవారం ఆయన జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావుతో కలిసి కదిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లోని వేరుశనగ విత్తన ప్రాసెసింగ్ యూనిట్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ, విత్తనకాయల ప్రాసెసింగ్ వేగవంతం చేయాలన్నారు. ఏడీఏ సత్యనారాయణ, ఏపీ సీడ్స్ డీఎం సుబ్బయ్య, ఏఓ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 256 మంది విద్యార్థుల గైర్హాజరు



కొత్తచెరువు: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. బుధవారం జరిగిన ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షకు 256 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన ప్రథమ సంవత్సరం పరీక్షకు జనరల్ విద్యార్థులు 3,753 మందికిగాను 3,573 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 334 మందికి గాను 311 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షకు జనరల్ విద్యార్థులు 1,165 మందికి గాను 1,122 మంది హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 112 మందికి గాను 102 మంది హాజరయ్యారు. డీఐఈఓ రఘునాథరెడ్డి, హైపవర్ కమిటీ అధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి, ఫ్లయింగ్ స్క్వాడ్ అంజిత్ నాయక్ జిల్లాలోని పలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీచేశారు.

ఆన్‌లైన్ మూల్యాంకనంపై సాధన చేయాలి..

తొలిసారి ప్రభుత్వం ఆన్‌లైన్ మూల్యాంకనం ప్రవేశపెట్టిన నేపథ్యంలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు కళాశాలల అధ్యాపకులు సాధన చేయాలని డీఐఈఓ రఘునాథరెడ్డి తెలిపారు. ఆన్‌లైన్ మూల్యంకానికి ల్యాప్‌టాప్ లేదా కంప్యూటర్ వాడుకోవచ్చన్నారు. ప్రైవేట్ కళాశాల అధ్యాపకులు మూల్యాంకానికి హాజరు కాకపోతే సదరు కళాశాలలపై చర్యలు తీసుకుంటామన్నారు.

క్లుప్తంగా

ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా విశ్వనాథ్‌రెడ్డి



పుట్టపర్తి టౌన్: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 1938 రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా విశ్వనాథ్‌రెడ్డి ఎన్నికయ్యారు. బుధవారం కృష్ణాజిల్లా గుడివాడలో ఆ సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశం నిర్వహించింది. ఇందులో భాగంగానే తనను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు విశ్వనాథరెడ్డి తెలిపారు. ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఆయన ఎంపిక పట్ల ఏపీటీఎఫ్ 1938 జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్‌రెడ్డి, కాలవ సురేంద్ర, కులశేఖర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు

డీపీఓను ప్రారంభించిన డీఆర్ఎం



డీపీఓ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డీఆర్ఎం వినీత్‌సింగ్

గుంతకల్లు: స్థానిక డీఆర్ఎం కార్యాలయంలో ఆధునీకరించిన సీనియర్ డివిజనల్ పర్సనల్ బ్రాంచ్ కార్యాలయాన్ని డీఆర్ఎం వినీత్‌సింగ్ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డీఆర్ఎంతో పాటు ఏడీఆర్ఎం సుధాకర్, సీనియర్ డీపీఓ జయశంకర్ చౌహాన్, డీఆర్ఎం సతీమణి, దక్షిణ మధ్య రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ గుంతకల్లు డివిజన్ అధ్యక్షురాలు అంజినీ సింగ్ తదితరులు హాజరయ్యారు. దాదాపు రూ.50 లక్షలతో ఆధునీకరించిన కార్యాలయంలో అధికారుల రూమ్‌లతో పాటు ఫర్నీచర్, ఇతరత్ర మౌళిక సదుపాయాలు కల్పించారు. డీఆర్ఎం వినీత్ సింగ్ మాట్లాడుతూ ఉద్యోగులకు సంబంధించిన అన్ని కార్యకలాపాలను ఈ ఆఫీసు నుంచే చేయాల్సి ఉందన్నారు.

మానవాకార.. ముక్కంటీశ్వరా

- శిల్పకళకు నిలయం 'హేమావతి'
- కోరిన కోర్కెలు నెరవేర్చే దైవంగా సిద్ధేశ్వరుడు
- 14 ఎకరాల విస్తీర్ణంలో ఆలయ సముదాయం

దేశంలో ఎక్కడా లేని విధంగా మానవ రూపంలో పరమేశ్వరుడు దర్శనమిస్తున్న ఏకైక దివ్యక్షేత్రం హేమావతి. కోరిన కోర్కెలు తీర్చే దైవం హెంజేరు సిద్ధేశ్వర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు నిత్యం పెద్ద ఎత్తున తరలివస్తుంటారు. శిల్పకళలకు నిలయమైన ఈ ప్రాంతాన్ని సందర్శించి మంత్ర ముగ్ధులవుతుంటారు.



మానవ రూపంలో దర్శనమిస్తున్న సిద్ధేశ్వరుడు



హేమావతిలోని గర్భగుడి



ఐదు అడుగుల ఎత్తున్న నందీశ్వరుడు

హేమావతి (అమరాపురం): ఉమ్మడి అనంతపురం జిల్లాలో అత్యంత ప్రసిద్ధిగాంచిన శైవక్షేత్రం అమరాపురం మండలంలోని హేమావతి గ్రామంలో ఉంది. ఇక్కడ హెంజేరు సిద్ధేశ్వరస్వామి మానవ ఆకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. చతుర్భుజాలలో శంఖు, చక్ర, త్రిశూల, డమరుకాలు కలిగి అభయహస్తంతో భక్తులను ఆశీర్వదిస్తుంటారు. శ్మశాన వాసుడైన భోళా శంకరుడు అందుకు ప్రతీకగా కపాలాల మాల ధరించి ఉంటారు. మూర్తిని అత్యంత అద్భుతంగా చెక్కారు.

నేడు కుగ్రామం.. నాడు రాజధాని..

శిల్పకళలకు నిలయంగా ఉన్న హేమావతి సుప్రసిద్ధ ప్రాచీన శైవక్షేత్రం. అమరాపురం మండలానికి 12 కిలోమీటర్ల దూరంలో ఉంది. హేమావతి ప్రస్తుతం ఓ కుగ్రామం. అయినప్పటికీ క్రీ.శ.720లో నోళంబ రాజ్యానికి రాజధానిగా వెలుగొందడమే కాకుండా ఎన్నో కీర్తి ప్రతిష్టలను ఆర్జించింది. హేమావతి చారిత్రక పేరు హెంజేరు. అనతికాలంలో హైమావతిగా రూపాంతరం చెంది ప్రస్తుతం హేమావతిగా పిలువబడుతోంది. హేమావతిని రాజధానిగా చేసుకొని నొళంబరాజులైన మంగశరాజే మొదటిగా పాలించిన రాజుగా చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తోంది. క్రీ.శ.720లో నొళంబ రాజులకు సామంతులైన పల్లవుల రాజైన త్రినయ పల్లవ (సింహవిష్ణువు) అనంతపురం, కర్నూలు, చిత్తూరు, కర్ణాటక రాష్ట్రంలోని చిత్రదుర్గం, ధార్వాడ, తుమకూరు, తమిళనాడులోని ధర్మపురి, సేలం జిల్లాలను కలుపుకొని రాజ్యపాలన చేశారని శిలాశాసనాలు చెబుతున్నాయి.

14 ఎకరాల విస్తీర్ణంలో...

హేమావతిలోని హెంజేరు సిద్ధేశ్వరస్వామి ఆలయ సముదాయం శిల్ప కళలకు నిలయంగా మన్ననలు అందుకుంటోంది. హేమావతి గ్రామం నడిబొడ్డున సువిశాలమైన 14 ఎకరాల విస్తీర్ణంలో ఆలయ సముదాయం, పార్కుతో భక్తులను కనువిందు చేస్తోంది. ప్రధానంగా సిద్ధేశ్వరస్వామి, దొడ్డేశ్వరస్వామి, మల్లేశ్వరస్వామి దేవాలయాలు ఉన్నాయి. ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశించిన వెంటనే మహాద్వారంలోనే సిద్ధేశ్వరస్వామి విగ్రహం ఉన్న ఆలయం కనిపిస్తుంది. దేశంలోనే ఎక్కడా లేని విధంగా శివుడు లింగరూపంలో కాకుండా మానవాకారంలో ఉండడంతో ఈ ప్రాంతం భక్తులకు, యాత్రికులకు ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఐదు అడుగుల మూడు అంగుళాల ఎత్తున్న ఇలాంటి విగ్రహం దేశంలోని ఏ శివాలయాల్లో లేదని, అన్ని ఆలయాల్లో శివుడు లింగరూపంలోనే ఉన్నాడని చరిత్రకారులు చెబుతున్నారు.

సూర్యకిరణాలు స్వామివారిపై...

సిద్ధేశ్వరాలయంలో శ్రావణ, కార్తీక మాసాల్లో సూర్యుడు అస్తమించే సమయంలో సూర్యకిరణాలు స్వామివారి ముఖంపై పడటం మరో విశేషంగా చెప్పవచ్చు. ఈ ఆలయ ముఖ ద్వారానికి ముందు భాగాన ధ్వజస్తంభం ఏర్పాటు చేశారు. ధ్వజస్తంభానికి కుడివైపున అగ్నిగుండం, ఎడమ వైపున ఆస్థానం ఏర్పాటు చేశారు.

పొలిమేరల్లో అక్కమ్మ ఆలయం..

గ్రామ పొలిమేరల్లో అక్కాచెల్లెళ్ల ఆలయం కూడా భక్తులను ఎంతగానో ఆకట్టుకొంటోంది. ఇక్కడ లభ్యమైన కొన్ని విగ్రహాలు చెన్నై, కర్ణాటకలోని చేలూరు మ్యూజియంకు తరలించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం వారు ఇక్కడ మ్యూజియం నిర్మాణం చేయడంతో ఇక్కడి పొలాల్లో పెద్దఎత్తున లభ్యమైన విగ్రహాలను పురావస్తుశాఖ వారు నిర్మించిన మ్యూజియంలో భద్రపరచడమేకాక వాటి వివరాలను సైతం భక్తులకు అందుబాటులో ఉంచారు.

పర్యాటకుల సందడి

ప్రతిరోజూ ఉదయం నుంచి రాత్రి వరకూ జిల్లా నలుమూలల నుంచే కాక కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వచ్చి సిద్ధేశ్వరస్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లిస్తుంటారు. ముఖ్యంగా మహా శివరాత్రి సందర్భంగా వారం రోజుల పాటు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. అలాగే శ్రావణమాసం, కార్తీకమాసంలో వివిధ రకాలుగా భక్తులు పూజలు నిర్వహిస్తుంటారు. ఈ గ్రామానికి పర్యాటకులు వస్తే పంచలింగాలను దర్శనం చేసుకోవచ్చు.

చిత్రాలతో కనువిందు..

దొడ్డేశ్వర ఆలయం ఈ ఆలయ ప్రాంగణంలోనే ఉంది. ఆలయంలో పెద్దఎత్తున శివలింగం చూపరులకు కనువిందు చేస్తోంది. ఈ ఆలయం రాతి స్తంభాలచే నిర్మితమైంది. అన్ని స్తంభాలపైన మలచిన రామాయణం, భాగవత దృశ్యాలు భక్తులను విశేషంగా ఆకర్షిస్తాయి. ఆయా గాథలు జరిగిన తీరును శిల్పాల ద్వారా చిత్రీకరించారు. ఈ ఆలయం ముందు భాగాన ఐదు అడుగుల ఎత్తు, పొడువున్న నందీశ్వరుని విగ్రహం ఉంది. ఈ విగ్రహం చెవుల్లో వజ్రాలు పొదిగారనే నెపంతో దుండగులు చాలా సంవత్సరాల క్రితం చెవులను ధ్వంసం చేశారు. 80 అడుగుల పొడవు, 40 అడుగుల వెడల్పు ఉన్న దొడ్డేశ్వర ఆలయ ప్రాంగణంలో ఘటిక స్థానం విద్యాకేంద్రంగా ఉండేదని శాసనాల ద్వారా తెలుస్తోంది. ఈ ఘటిక స్థానంలో శిక్షణ తీసుకొన్న వారు కంచిపీఠం తదితర ప్రాంతాలకు వెళ్లి తమ పాండిత్యాన్ని ప్రదర్శించేవారని తెలుస్తోంది.

సిద్ధేశ్వరుడు మహిమాన్వితుడు



దేశంలో ఎక్కడాలేని విధంగా హేమావతిలో మానవరూపంలో శివుడు దర్శనం ఇస్తారు. ఇక్కడికి వచ్చే భక్తులకు స్వామి వారిని ఏది కోరుకుంటే అది ప్రసాదిస్తాడనే నమ్మకం ఉంది. ఇక్కడ పంచలింగేశ్వర దర్శనం కూడా చేసుకోవచ్చు. విరూపాక్షేశ్వరస్వామి, దొడ్డేశ్వరస్వామి, సోమేశ్వరస్వామి, మల్లేశ్వరస్వామి, సిద్ధేశ్వర స్వామి అలాగే సిద్ధేశ్వరస్వామి చెల్లెలు నవకోటమ్మను దర్శించుకోవచ్చు.

– సిద్ధలింగేశ్వరస్వామి, అర్చకుడు, హేమావతి

పాడి ఆవు తన్నడంతో రైతు మృతి

లేపాక్షి: మండలంలోని నాయనిపల్లికి చెందిన లోకేష్ (48) పాడి ఆవు తన్నడంతో మృతి చెందారు. బుధవారం ఉదయం ఎప్పటి లాగే పాలు పితకడానికి పాడి ఆవు దగ్గరకు వెళ్లాడు. వెనుక కాళ్లతో తన్నడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. భార్య శివమ్మతో పాటు స్థానికులు గమనించగా.. అప్పటికే అతను చనిపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పాడి రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానిక రైతులు విజ్ఞప్తి చేశారు.

24 నుంచి ఉచిత శిక్షణ

అనంతపురం: రూడ్‌సెట్‌లో ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంత నిరుద్యోగులకు సెల్‌ఫోన్ రిపేరీ, సర్వీసింగ్, ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ కోర్సుల్లో జూన్ 24 నుంచి ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు రూడ్‌సెట్ డైరెక్టర్ విజయలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. 19 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 9618876060, 8309915577, 9440905479, 08554-255925 నంబర్లను సంప్రదించాలన్నారు.

కడప, నెల్లూరు జట్ల విజయం



అర్జున్‌కు మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డును అందిస్తున్న దృశ్యం

అనంతపురం: సౌత్ జోన్ అండర్ -19 అంతర జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా బుధవారం జరిగిన మ్యాచుల్లో కడప, నెల్లూరు జట్లు విజయం సాధించాయి.

- ఆర్డీటీ స్టేడియంలోని బీ గ్రౌండ్‌లో చిత్తూరు, కడప జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన చిత్తూరు 40.5 ఓవర్లలో పది వికెట్ల నష్టానికి 112 పరుగులు చేసింది. చరణ్‌జిత్ 48 పరుగులతో రాణించాడు. శ్రీసాయిచరణ్‌రెడ్డి నాలుగు వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన కడప జట్టు 24 ఓవర్లలోనే 5 వికెట్లు కోల్పోయి 115 పరుగులు చేసి విజయం సాధించింది. రణధీర్‌రెడ్డి 23 పరుగులు, టి. సుదర్శన్ 25 పరుగులు చేసి నాటౌటాగా నిలిచారు. ఐదు వికెట్ల తేడాతో కడప జట్టు విజయం సాధించింది. సాయిచరణ్‌రెడ్డి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను దక్కించుకున్నారు.
- నెల్లూరు, కర్నూలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి నెల్లూరు జట్టు బ్యాటింగ్ తీసుకుంది. నెల్లూరు జట్టు 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 280 పరుగులు చేసింది. అర్జున్ 86 పరుగులు చేసి సత్తాచాటాడు. కే. ప్రసాద్ 58 పరుగులు చేసి రాణించారు. ఆక్షిత్‌రెడ్డి మూడు వికెట్లు, అశోక్ కుమార్, మోహిత్ చెరో రెండు వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ చేసిన కర్నూలు జట్టు 50 ఓవర్లకు 5 వికెట్లు కోల్పోయి 234 పరుగులకే పరిమితమైంది. 46 పరుగులతో నెల్లూరు జట్టు విజయం సాధించింది. మనోజ్ రాజు 60 పరుగులు, విష్ణువర్ధన్ 35 పరుగులతో రాణించినా ప్రయోజనం లేకపోయింది. అర్జున్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

నేడు 'ఆముదం' విత్తన మేళా



ఆముదం పంట

అనంతపురం అగ్రికల్చర్: ఆముదం పంట అంశంపై గురువారం బుక్కరాయసముద్రం మండలం రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానంలో 'విత్తన మేళా' ఏర్పాటు చేసినట్లు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాకు ఉమ్మడి అనంతపురం జిల్లా నలుమూలల నుంచి ఆముదం పండించే రైతులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, భారత నూనెగింజల పరిశోధనా స్థానం (ఐసీఏఆర్), ఆల్ ఇండియా కో ఆర్డినేటెడ్ ప్రాజెక్టు ఆన్ క్యాస్టర్ (ఆముదం) కేంద్రాల నుంచి శాస్త్రవేత్తలు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆముదం రైతులతో శాస్త్రవేత్తలు ముఖాముఖి ఉంటుందన్నారు. ఆముదం పంట విస్తరిస్తున్న నేపథ్యంలో కొత్త రకం వంగడాలు, సాగులో తీసుకోవాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం, చీడపీడల నివారణ, అధిక దిగుబడులు సాధించడం తదితర అంశాలపై విత్తన మేళాలో చర్చించనున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగానే కొందరు రైతులకు కొత్త రకం ఆముదం వంగడాలను పంపిణీ చేసి వారి చేత ప్రయోగాత్మకంగా సాగు చేయించనున్నట్లు తెలిపారు.

యువకుల మధ్య ఘర్షణ

గుత్తి: పట్టణంలోని టమాట మార్కెట్‌లో మంగళవారం అర్ధరాత్రి యువకుల మధ్య ఘర్షణ జరిగింది. బోయ మధు, అతని సోదరుడు భాస్కర్ మద్యం సేవిస్తున్న సమయంలో కిరణ్ అనే యువకుడు వారి వద్దకు వెళ్లి అకారణంగా గొడవ పెట్టుకున్నాడు. దీంతో వారి మధ్య ఘర్షణ జరిగింది. కిరణ్ .. బోయ మధుపై మద్యం బాటిల్‌తో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన మధును ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మధు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కిరణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నబీరసూల్ తెలిపారు.

మయూర వాహనంపై వేంకటరమణుడు



మయూర వాహనంపై ఊరేగుతున్న వేంకటరమణస్వామి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన ప్రసన్న వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. 10వ రోజు బుధవారం శ్రీవారి వసంతోత్సవం, మయూర వాహనోత్సవ సేవలను ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు తర్వాత స్వామి వారి వసంతోత్సవం, కంకణ విసర్జన, చక్రస్నానం, మహా మంగళహారతిని వేడుకగా జరుపుకున్నారు. ఉదయం స్వామి వారి వసంతోత్సవాన్ని దేవాలయం వద్ద నుంచి లక్ష్మీబజార్‌కు నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన మయూర వాహనంపై శ్రీవారిని పురవీధుల్లో ఊరేగించారు. విశ్వ హిందూ పరిషత్, రజక సంఘం, వడ్డెర్ల సంఘం, హరిజన సంఘం ఆధ్వర్యంలో శ్రీవారి మయూర వాహన సేవ కొనసాగింది. చివరి రోజు గురువారం సప్తప్రాకారోత్సవం, శయనోత్సవ కార్యక్రమాలతో శ్రీవారి ఉత్సవాలు ముగిస్తాయని ఈఓ నరసింహారెడ్డి తెలిపారు.

అశ్వవాహనంపై విహరించిన నృసింహుడు



అశ్వవాహనంపై విహరిస్తున్న లక్ష్మీనారసింహుడు

ఉరవకొండ: పెన్నహోబిళం లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీవారు అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భూదేవి, శ్రీదేవి సమేత లక్ష్మీనారసింహుడు అశ్వ వాహనంపై భక్తులకు దర్శనిమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ విజయ్‌కుమార్, ప్రధాన అర్చకులు ద్వారకానాథచార్యులు, బాలాజీ స్వామిలు పాల్గొన్నారు.

యేసయ్యను విశ్వసిస్తే అన్నీ శుభాలే

- బైబిల్ మిషన్ చర్చి పాస్టర్ రెవరెండ్ అద్భుత కుమార్



మహిమ సువార్త మహాసభలకు హాజరైన దేశ, విదేశాల ప్రతినిధులు, భక్తులు

గుత్తి: 'విశ్వంలో అత్యంత మహిమాన్వితుడు యేసు ప్రభువు. ఆయన్ను అందరూ విశ్వసించాలి. ప్రార్థించాలి. యేసయ్యను విశ్వసిస్తే అన్నీ శుభాలే జరుగుతాయి'అని బైబిల్ మిషన్ చర్చి (స్వస్థత శాల) పాస్టర్లు రెవరెండ్ అద్భుతకుమార్, మణికుమారి అన్నారు. గుత్తి బైబిల్ మిషన్ చర్చిలో బుధవారం మహిమ సువార్త మహాసభలు అత్యంత ఘనంగా ప్రారంభమయ్యాయి. మహాసభలకు దేశ విదేశాలకు చెందిన ప్రముఖ పాస్టర్లు, ప్రతినిధులు హాజరయ్యారు. ప్రముఖ పాస్టర్లు డాక్టర్ జాన్ నెర్మన్ సిపాయుంగ్, సెమరాంగ్ థామస్ (ఇండోనేషియా), జాన్ బ్రిట్టో (సింగపూర్), డాక్టర్ ప్రకాష్ డేనియల్(అమెరికా-ఫ్లోరిడా), కృపాకర్(తమిళనాడు), శామ్యూల్ భలే రావు(సికిందరాబాద్), తిమోతి రాజ్ (తెలంగాణ) హాజరైయ్యారు. ఈ సందర్భంగా అద్భుత్‌కుమార్, మణి కుమారి వేలాది మంది భక్తులు, వివిధ ప్రాంతాలకు చెందిన ప్రతినిధులను ఉద్దేశించి ప్రార్థనలు చేశారు. ప్రతి ఒక్కరూ యేసయ్యపై విశ్వాసం, నమ్మకం ఉంచాలన్నారు. సృష్టిలో యేసయ్యకు మించిన దేవుడు లేడన్నారు. అనంతరం సంగీత మహోత్సవాన్ని నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరించాయి.

అక్రమ మద్యం స్వాధీనం



మద్యం బాటిళ్లను చూపుతున్న పోలీసులు

ముదిగుబ్బ: మండల పరిధిలోని మలకవేముల క్రాస్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో సిబ్బందితో కలసి దాడులను నిర్వహించినట్లు పట్నం ఎస్ఐ నరసింహుడు తెలిపారు. ఈ దాడుల్లో ప్రతాపరెడ్డి వద్ద ఉన్న 88 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

బాస్కెట్ బాల్ శిక్షణకు ఎంపిక



ద్వారకనాథరెడ్డి

అనంతపురం: నేషనల్ బాస్కెట్ బాల్ శిక్షణకు అనంతపురం నగరానికి చెందిన ద్వారకనాథరెడ్డి ఎంపికయ్యారు. జూన్ 6 నుంచి జులై 6వ తేదీ వరకు ఇండోర్‌లో జరిగే శిక్షణ శిబిరంలో అతను పాల్గొననున్నాడు. ఇందులో ప్రతిభ చాటితే భారత జట్టుకు ఎంపిక చేస్తారు. ఇటీవల జరిగిన అండర్ -18 జాతీయస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రదర్శన ఇవ్వడంతో ద్వారకనాథరెడ్డి ఈ శిక్షణ శిబిరానికి ఎంపికయ్యాడు.